www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 275 | శనివారం | 29 మార్చి, 2025



## మయన్మార్, థాయిలాండ్‌లో భూకంపం

### 167 మంది దుర్మరణం

- రిక్టర్ స్కేల్‌పై 7.7గా నమోదు
- 300కు పైగా గాయపడ్డారని సమాచారం
- చైనాలోనూ పలు భవనాలు నేలమట్టం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- బ్యాంకాక్ పర్యటనలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్
- భూకంపం నుంచి బయటపడ్డట్లు సమాచారం
- భూకంపాలపై ప్రధాని మోడీ ఆరా
- మయన్మార్, థాయిలాండ్ దేశాలకు బాసట

“మయన్మార్, థాయిలాండ్ దేశాలు శుక్రవారం భారీ భూకంపం తాకిడికి విలవిలలాడాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 7.7గా నమోదైంది. భూకంపం ధాటికి మయన్మార్‌లో 167 మంది మరణించారు. 300 మందికిపైగా గాయపడ్డారు. భారీ భవనాలు నేలమట్టం కాగా, శిథిలాల కింద వందలాది మంది చిక్కుకున్నట్లు వార్త కథనాలు వెలువడతున్నాయి. జనం వీధుల్లో, రోడ్లపైనే బిక్కుబిక్కుమంటూ గడుపున్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఒక ఎత్తైన భవనం కుప్పకూలినప్పుడు కనీసం ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందగా, 90 మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది.”





# హోదా ఇవ్వలేం

## తెలంగాణకు కేంద్రం షాక్

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదా ప్రతిపాదన తిరస్కరణ
- ఏపీతో వివాదం నేపథ్యంలో పరిగణనలోకి తీసుకోలేమని వెల్లడి

**ప్రజానావ, హైదరాబాద్:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రజల్‌శక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి

మిగతా 2 లో





# అర్హులందరికీ కార్డులు, సన్నబియ్యం

- త్వరలోనే ఉప్పు, పప్పు, ఇతర సరుకులు కూడా..
- హామీ నిలబెట్టుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

03

“అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు.”



# విషాదం

- ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారుల అనుమానాస్పద మృతి
- తల్లి పరిస్థితి విషమం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

02



## టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

- రెండు బాడీలు తీసేందుకు రెస్క్యూ బందాలు
- బురద, సున్నం మట్టితో ఇబ్బందులు

02




## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుకు నో

- పిటిషన్ తిరస్కరించిన సుప్రీం



02



## మరో పరువు హత్య

- కూతురిని ప్రేమించాడని యువకుడి హత్య
- గొడ్డలితో కిరాతకంగా నరికి చంపిన యువతి తండ్రి
- పుట్టినరోజు నాడే మృతి..
- పెద్దపల్లి జిల్లాలో విషాదం

పుట్టినరోజు నాడే యువకుడిని తన కుమార్తెని ప్రేమిస్తున్నాడనే నెపంతో యువతి తండ్రి దారుణంగా గొడ్డలితో నరికి చంపాడు. ఈ హత్య ఘటన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో జరిగింది. ఈ విషయంపై మృతుడి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

02



## కొత్త బండి 2 హెల్మెట్లు

- బండి కొనేప్పుడే అంటగట్టే ఆలోచన

02

## బెట్టింగ్ యాప్స్ నిర్మూలన.. సజ్జనార్‌కు కీలక బాధ్యతలు

02



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# వక్ఫ్ సవరణ బిల్లుకు వెనక్కి తీసుకోవాలి




- వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన
- వక్ఫ్ ఆస్తులపై కేంద్ర హస్తక్షేపాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింల భారీ నిరసనలు
- వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిక

**న్యూఢిల్లీ:** మైనారిటీ హక్కులను కాలరాస్తోందన్న ఆరోపణల మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డ్ ఇచ్చిన పిలుపు మేరకు ముస్లిం సమాజం నేడు (శుక్రవారం) దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. జుమా అల్ విధా ప్రార్థనల అనంతరం ముస్లింలు దేశంలోని అనేక నగరాల్లో రోడ్లపైకి వచ్చి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డుల స్వతంత్రతకు ముప్పు వాటిల్లేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న బిల్లును ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తుల పరిపాలనను ప్రభుత్వాధీనంలోకి తీసుకురావడమే కాకుండా, ముస్లింల హక్కులను హరిస్తుందని ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు.

**బిల్లుతో ముస్లిం ఆస్తులపై కేంద్ర ఆధిపత్యం**

కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు బిల్లులో వక్ఫ్ భూములు, ఆస్తుల నిర్వహణపై పూర్తి నియంత్రణను ప్రభుత్వానికి అప్పగించేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఇది వక్ఫ్ బోర్డుల స్వతంత్రతను దెబ్బతీస్తుందని ముస్లిం మత పెద్దలు, న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వక్ఫ్ ఆస్తులు ఎప్పటి నుంచో ముస్లిం సమాజానికి సేవలందించే దేవాదాయ ఆస్తుల వంటివి. వీటి నిర్వహణను ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావడం ముస్లిం హక్కులపై కవాతం వేసినట్టే అని వారు అభిప్రాయపడుతున్నారు.

**దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు**

దేశ రాజధాని ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు, లక్నో నుంచి కోల్‌కతా వరకు దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ముస్లింల నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. 'వక్ఫ్ ఆస్తులపై హక్కు మాకు, కేంద్రానికి కాదు', 'ముస్లిం ఆస్తులను హరిస్తే ఊరుకోం' అంటూ నినాదాలతో ముస్లిం సమాజం వీధుల్లో గళమెత్తింది. ముస్లిం మతపెద్దలు, సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం తక్షణం బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం మత నాయకుల ఆధ్వర్యంలో పలు నగరాల్లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించగా, ముస్లింల ఆదరణ భారీగా కనిపించింది.

**ఆస్తుల స్వతంత్రత కోల్పోతే మైనారిటీలకు ముప్పు**

ముస్లిం మత పెద్దలు, న్యాయ నిపుణులు స్పష్టంగా హెచ్చరిస్తూ, వక్ఫ్ బోర్డులపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ తెచ్చే ప్రయత్నం మైనారిటీ హక్కులకు పునాది దెబ్బతీసే ప్రయత్నమే అని తెలిపారు. వక్ఫ్ బోర్డుల స్వతంత్రతకు ముప్పు వాటిల్లితే ముస్లింల సమాజ సేవా కార్యక్రమాలు నిలిచిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**కేంద్రం వెనక్కి తగ్గకుంటే తీవ్ర పరిణామాలు**

నిరసనకారులు 'బిల్లు వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు జరుగుతాయి' అని హెచ్చరిస్తున్నారు. ముస్లింల హక్కులను కాలరాస్తే అది దేశంలో మత సామరస్యానికి గండిపడుతుందని ముస్లిం మత పెద్దలు స్పష్టం చేశారు. 'వక్ఫ్ ఆస్తులపై ముస్లింలకే హక్కు.. ప్రభుత్వానికి కాదు' అని వారు గళమెత్తారు.

**స్పందించకపోతే నిరసనలు ఉధృతం**

ప్రస్తుతం కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో ముస్లిం సంఘాలు నిరసనలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాయి. ముస్లిం సమాజాన్ని అవమానించే ఏ చర్యనైనా ఉపేక్షించబోమని ముస్లిం నేతలు హెచ్చరిస్తున్నారు. బిల్లు వెనక్కి తీసుకునే వరకూ ముస్లింల ఆందోళనలు ఆగవు అని స్పష్టం చేశారు.కేంద్రం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతంగా మారి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ముస్లిం మత పెద్దలు హెచ్చరించారు.

## తెలంగాణకు కేంద్రం షాక్

మొదటి పేజీ తరువాయి

పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుకు నో

**న్యూఢిల్లీ, మార్చి 28 :** జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీ విచారణ జరుపుతున్నందున ఈ దశలో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించలేమని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీని కేంద్ర నోటిఫై చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తన నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు కనిపించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో మరీ కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనిపై ఒకవైపు సీజేఐ ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరుపుతుండగానే, అలహాబాద్ హైకోర్టుకు ఆయనను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నోటిఫై చేసింది. భారత రాజ్యాంగంలోని 222వ నిబంధనలోని క్లాజ్ వన్ ద్వారా రాష్ట్రపతి తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుని భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలాహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలనే సిఫారసు ఆమోదించారని ఆ ఉత్తర్వు తెలిపింది. జస్టిస్ వర్మ అలాహాబాద్ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించినట్టు పేర్కొంది. జస్టిస్ వర్మపై ఆరోపణల దుమారం నేపథ్యంలో ఆయనను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫారసు చేసింది. అయితే ఈ నిర్ణయంతో అలబాహాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ విభేదించింది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుతో సహా దేశంలోని ఏ కోర్టుకు బదిలీ చేయరాదని, ఆయనపై ఉన్న అభియోగాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, అభిశంసన చేపట్టాలని, ఆయన పాత కేసుల్లో తీర్పులను కూడా తిరగదోడాలని హైకోర్ట్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2శాతం డీఏ పెంపు

**కేబినేట్ ఆమోదిస్తూ తీర్మానం**

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటు–ంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

## ఇక రెండు హెల్మెట్లు

**న్యూఢిల్లీ :** దేశంలో నిరంతరం రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు, వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంది. ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కొన్ని మార్పులను కూడా తీసుకొస్తోంది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కర్ కొత్త ఆలోచనతో ముందుకొచ్చారు. దీని ప్రకారం ఇకపై దేశంలో టూవీలర్లను ఖచ్చితంగా ఐఎస్ఐ సర్టిఫికేషన్ కలిగిన రెండు హెల్మెంట్లతో కలిపి విక్రయించాలని పేర్కొన్నారు. ఇదే అమలులోకి వస్తే ద్విచక్రవాహం కొనే వ్యక్తులకు బండి డెలివరీతో పాటు– రెండు హెల్మెట్లు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందిజ కేంద్ర మంత్రి గడ్కరీ ఈ విషయాన్ని దిల్లీలో జరిగిన ఆటో సమ్మిట్ కార్యక్రమంలో మాట్లాడుతూ వెల్లడించారు. ఈ ప్రతిపాదనను దేశంలోని టూవీరల్స్ హెల్మెట్ తయారీదారుల అసోసియేషన్ స్వాగతించింది.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గడ్కరీ ఆదేశం కీలకమైనదిగా తెలుస్తోంది. దేశంలో చాలా కాలంగా ఎదుర్కొంటు–న్న రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించటానికి ఇది దోహదపడే చర్యగా ఆటో రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలు కలిగిన హెల్మెంట్లను వాహనదారులు ఉపయోగించేలా ఇది ప్రేరేపిస్తుందని హెల్మెట్ తయారీదారుల సంఘం అభిప్రాయపడింది.

## సజ్జనార్‌కు కీలక బాధ్యతలు



**ప్రజానావ, హైదరాబాద్:** బెట్టింగ్ భూతాన్ని తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన కొందరు సెలబ్రిటీలను పోలీసులు విచారించారు. అయితే ఇలా చేయడం ద్వారా బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిర్మూలించలేమని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్)ను ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. ఈ క్రమంలో ఆర్టిసి ఎండి సజ్జనార్‌కు కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే టాక్ వినిపిస్తోంది. సిట్ గురించి అసెంబ్లీలో ప్రకటన చేసే ముందు సిఎం ఓ సమావేశం నిర్వహించారు. శాసనసభలోని ఆయన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిజిపి జితేందర్, డిజి శివధర్ రెడ్డి, హైదరాబాద్ కమీషనర్ సివి ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్‌తో పాటు సజ్జనార్ కూడా పాల్గొన్నారు. దీంతో ఈ సిట్ ఏర్పాటులో సజ్జనార్‌కి కూడా కీలక బాధ్యతలు అప్పగిస్తారనే వార్తలు చెక్కర్లు కొడుతున్నాయి.

## సంగారెడ్డి జిల్లాలో విషాదం



**ప్రజానావ, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద రీతిలో ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాగా తల్లి తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.స్థానిక సీఐ నరేశ్ కథనం ప్రకారం అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రాజితలు నివాసం ఉంటున్నారు. వారికి సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. చెన్నయ్య పొట్టకూటి కోసం వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు 3 పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు. చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగు అన్నం తిన్నారు. భోజనం చేసిన తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకున్నాడు. రాజిత తలుపులు తెరవగా ఆ సమయంలో పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడం వల్ల స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా అప్పటికే ముగ్గురు చిన్నారులు మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నయ్యది రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి మండలం మెడకపల్లి. బతుకుదెరువు కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. కాగా చిన్నారుల మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ : ఘటనా స్థలాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వచ్చి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంటి ముందు వెనుక భవనంపైన కూడా ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోపక్క భార్య పిల్లలు పెరుగన్నం తినటం, భర్త ఒక్కడే పప్పు, అన్నం తినడం అది కూడా సందేహంగా ఉంది. అయితే పిల్లల పోస్టుమార్టం రిపోర్టు వస్తే గాని ఏం చెప్పలేమని పోలీసులు చెబుతున్నారు.

**పోస్టుమార్టం రిపోర్టు వస్తే :**

చెన్నయ్యకు రెండో పెళ్లి అని తెలిసినా వివాహం చేయడం తాము చేసిన పొరపాటని రాజిత తల్లి పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కూతురు రాజితతో అల్లుడు గొడవపడేవాడని గుర్తు చేశారు. ఒకసారి గొడవపడి కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయని, రాజిత కుమారుడిని తీసుకొని తన ఇంటికి వచ్చిందని అన్నారు. ఇదే విధంగా గొడవ కొనసాగితే పిల్లలకు విషమిచ్చి తాను చనిపోతానని చెప్పిందని తెలిపింది.



## మరో పరువు హత్య

**కూతురిని ప్రేమించాడని యువకుడి హత్య**

**ప్రజానావ, పెద్దపల్లి:** పుట్టిన రోజే ఓ యువకుడిని యువతి తండ్రి గొడ్డలితో అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్ గౌడ్ (17) వేరే సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయికుమార్ పుట్టినరోజు కావడంతో గ్రామశివారులో మిత్రులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నాడు. ఇంతలో అక్కడికి యువతి తండ్రి సదయ్య చేరుకున్నాడు. సాయిపై గొడ్డలితో వేటు వేశాడు. మొదట సాయి మెడపై అమ్మాయి తండ్రి వేటు వేయగా.. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడిని నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరిగెత్తాడు. అయినప్పటికీ అతడిని వదలలేదు. సాయి కుమార్‌ను కాపాడటానికి స్నేహితులు కూడా వెనకే పరిగెత్తారు. కానీ బొడ్రాయి దగ్గర మళ్లీ వరుసగా సాయిపై గొడ్డలి పోట్లు పడ్డాయి. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం సదరు యువకుడి తల్లిదండ్రులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయిని నరికిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఏసీపీ కృష్ణ ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్ పుట్టినరోజే ఇలా దారుణ హత్యకు గురికావడం గ్రామంలో కలకలం రేపింది. కాగా సాయికుమార్ సోదరి ఐదేళ్ల క్రితం డెంగీతో మృతి చెందగా, ఇప్పుడు సాయికుమార్ ఇలా హత్యకు గురయ్యాడు. దీంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

**ప్రజానావ, నాగర్ కర్నూల్:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు స్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉబికి వస్తున్న ఊట నీటితో సొరంగమంతా బురదమయంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కార్మికుల మృతదేహాలను గుర్తించేందుకు అడ్డుగా ఉన్న బోరింగ్ మిషన్‌ను కటింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా శకలాలను బయటకు పంపిస్తున్నారు. ఇటీవల లభ్యమైన మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో మరో డెడ్ బాడీ ఉన్నట్లు గుర్తించిన రెస్క్యూ బృందాలు బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. కార్మికులకుపై పడిన బురద మట్టి, సున్నం మట్టి బిగుసుకుపోవడంతో మట్టిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కేడవార్ డాగ్స్‌ను తెప్పించి మరోసారి సొరంగంలో పరిశీలించినా దుర్వాసన వల్ల మృతదేహాలను గుర్తించకపోయినట్టు తెలుస్తుంది. శుక్రవారం ఏడున్నర గంటల ప్రాంతంలో రెస్క్యూ బృందాలు మరోమారు టన్నెల్లోకి సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరాయి. రెస్క్యూ బృందాలు మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చే అవకాశం ఉండడంతో మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో ఉన్న మరో వ్యక్తి డెడ్ బాడీ వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం శివశంకర్ అనే ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. గత మూడు రోజులుగా ఆయన సమక్షంలోనే రెస్క్యూ బృందాలు సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.



# కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

- అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని
- ఎమ్మెల్సీ కవిత



**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా ఉన్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసనమండలిలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు. సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ఈ మండలి సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు. ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.



# అర్హులందరికీ కార్డులు, సన్నబియ్యం

## త్వరలోనే ఉప్పు, పప్పు, ఇతర సరుకులు కూడా..

### ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్నాం.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

**ప్రజానావ, నల్లగొండ:** అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈ క్రమంలో ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. హుజూర్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. అందుకే సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు- ఖర్చు చేస్తున్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే కార్డుకు అర్హుల జాబితా సిద్ధం అయ్యిందన్నారు. సిఎం రేవంత్ చేతుల మీదుగా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు.

# భావస్వేచ్ఛను గౌరవించాలి

- అది ప్రాథమిక హక్కు కిందకే వస్తుంది
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** కవిత్వం, నాటకం, స్టేజీ ప్రదర్శనలు, వ్యంగ్యం మరియు కళల ద్వారా భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే ప్రాథమిక హక్కుని గౌరవించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ ఖూన్ కే ప్యాసె బాత్ సునో' అనే కవితను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం కొట్టివేసింది. వాక్‌స్వేచ్ఛ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి కోర్టులు ముందంజలో ఉండాలని పేర్కొంది. ఉదారవాద, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కులైన వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ప్రతి విమర్శ లేదా అసమ్మతిని తమ అధికారం మరియు స్థానానికి ముప్పుగా భావించే అభద్రతా భావంతో బలహీనం చేయకూడదని జస్టిస్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన ఆంక్షలు సహేతుకంగానే ఉండాలని జస్టిస్ భుయాన్ వివరించారు. ఆంక్షలు హానికరం లేదా అణచివేతగా ఉండకూడదని, స్వేచ్ఛగా మాట్లాడే ప్రాథమిక హక్కుని ఆంక్షలు కప్పివేయలేవని జస్టిస్ భుయాన్ సూటిగా పేర్కొన్నారు. ఒక వ్యక్తి వాక్, భావ ప్రకటనా హక్కుని కాపాడటం , గౌరవించడం పోలీసుల, ప్రభుత్వాల భాద్యత అని ధర్మాసనం ఉద్ఘాటించింది. కవిత్వం, నాటకం, సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు, వ్యంగ్యం, కళలు సహా సాహిత్యం జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తుందని, వ్యక్తులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తీకరించే హక్కులను గౌరవించాలని జస్టిస్ ఓకా పునరుద్ఘాటించారు. ఆరోగ్యకరమైన ,నాగరిక సమాజంలో వాక్ స్వాతంత్ర్యం అంతర్భాగమని, మెజారిటీ- వ్యక్తులు అభిమానిస్తున్నారనే కారణంతో ఒక వ్యక్తి అభిప్రాయాలను అణచివేయలేమని కోర్టు వ్యాఖ్యానించింది. పోలీసులు కూడా భిన్నాభిప్రాయాలను కాపాడాలని, అవి కూడా ప్రజాస్వామ్య విధుల్లో ఒక భాగమని కోర్టు పేర్కొంది. ఆలోచనా స్వేచ్ఛ లేకుండా భావప్రకటన లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హామీ ఇచ్చిన గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. పోలీసులు మరియు ప్రభుత్వం వాక్ స్వాతంత్యాన్ని కాపాడటంలో విఫలమైతే కోర్టులు తప్పకుండా జోక్యం చేసుకోవాలని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయకుండా చూసుకోవడం కోర్టుల విధి అని పేర్కొన్నారు. కులం మతం ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య శతృత్వాన్ని పెంచుతున్నారని ఆరోపిస్తూ గుజరాత్ పోలీసులు ప్రతాప్‌గర్హిపై కేసు నమోదు చేశారు. మార్చి 3 విచారణ సమయంలో ఈ కవిత అహింసను సూచిస్తుందని మహాత్మాగాంధీ స్వయంగా అనుసరించిన మార్గమని మార్చి 3న జరిగిన విచారణలో జస్టిస్ ఓకా పేర్కొన్న సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్ విధానాలతో కుప్పకూలిన రియల్ రంగం

## ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు



**ప్రజానావ, హైదరాబాద్:** నగర అభివృద్ధి, రియల్ ఎస్టేట్ పరిస్థితి, ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేస్తూ, గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో నగరం సౌభాగ్యంగా ఎదిగిందని, కానీ 15 నెలల కాంగ్రెస్ పాలనలో అభాగ్యంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలోని రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా కుంచించుకుపోయిందని తెలిపారు. పేదల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్న ప్రభుత్వం, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు చేస్తోందని విమర్శించారు. గత త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఇండ్ల విక్రయాలు 49శాతం తగ్గాయని, ఆఫీస్ లీజింగ్ రంగం 41శాతం క్షీణించిందని గణాంకాలతో తెలిపారు. వ్యవసాయ రంగంలో మాత్రమే కాదు, రియల్ వ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా మారిందని, కాంగ్రెస్ పాలనలో వ్యాపారస్తులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షంగా హితబోధ చేశారు. కూల్చడం కంటే కట్టడాన్ని నేర్చుకోవాలని, అబద్దాల కన్నా అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. 'జాగో తెలంగాణ జాగో!' అంటూ తెలంగాణ ప్రజలను అప్రమత్తం చేశారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితి, హైదరాబాద్ నగరాభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై కేటీఆర్ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం అవివేకం

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకపూరిత నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం ఒక పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోనుందని కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తూ ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్య చేశారు. కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాదు, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక ప్రకటనపై కూడా ఆయన స్పందించారు. నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని తప్పుగా పేర్కొన్నారు. అయితే, విద్యార్థులు, అధ్యాపకుల సమాచారాన్ని ప్రకారం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 700కు పైగా పుష్ప వృక్ష జాతులు, 10 రకాల సస్తన ప్రాణులు, 15 రకాల సరీసృపాలు , 200కి పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు ఏకంగా బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నిర్ణయాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పుబడుతూ, ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఓ విపరీతమైన నిర్ణయం. ఒక వైపు ప్రకృతి రక్షణ అంటూ మాట్లాడుతూ, మరోవైపు ప్రకృతి నాశనానికి పాల్పడటం ఆశ్చర్యకరం. ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చేందుకు, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే చర్య అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను!అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# విష్ణుప్రియకు కోర్టులో చుక్కెదురు

**ప్రజానావ, హైదరాబాద్:** బెట్టింగ్ యాప్‌ల కేసులో నటి విష్ణుప్రియకు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. మియాపూర్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కొట్టేయాలంటూ ఆమె హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం తెలంగాణ హైకోర్టు విచారించింది. ఎఫ్ఐఆర్ కొట్టేసేందుకు.. అలాగే ఈ దర్యాప్తుపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతేకాకుండా..ఈ కేసులో పోలీసులకు సహకరించాలని విష్ణు ప్రియను హైకోర్టు ఆదేశించింది. అలాగే చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌లపై ప్రచారం చేసిన పలువురు నటులు, ఇన్‌ఫ్లూయన్సర్లపై మియాపూర్‌తోపాటు పంజాగుట్ట పోలీసులు పలు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా పలువురు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. బెయిల్ పొందేందుకు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.



## దేవాదుల పైపులైన్ లీకేజీ

ప్రజానావ, హైదరాబాద్: జిల్లా ధర్మసాగరం మండలం సాయిపేటలో దేవాదుల పైప్‌లైన్ లీకైంది. దీంతో ఆకాశాన్ని తాకేలా నీరు పైకి ఎగసిపడ్డాయి. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో నీరు వృధాగా పోతున్నది. ధర్మసాగర్ పంపు హౌస్ నుంచి గండిరామారం రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు పైప్‌లైన్ గుండా వెళ్తున్నాయి. అయితే విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ఫెయిల్యూర్ కారణంగా మోటార్ ట్రిప్ అయింది. దీంతో పైప్‌లైన్ పగలిపోవడంతో ఫౌంటేన్‌ను తలపించేలా భారీగా నీరు పైకి ఎగసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు వృథాగా పోతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాలం చెల్లిన స్వీట్స్ రీసైక్లింగ్

- మళ్లీ కొత్తగా స్వీట్స్ తయారీ
- మల్లాపూర్ ఆమన్ స్వీట్స్ షాప్‌పై దాడి
- లైసెన్స్ రద్దు చేసి, షాపు సీజ్ చేసిన అధికారులు

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రముఖ స్వీట్ షాపులో కూడా కల్తీ జరుగుతుందని విషయం ఇప్పుడు బయటపడింది.. ప్రముఖ స్వీట్ షాపులకు సరఫరా చేస్తున్నా తయారీ కేంద్రం పైన ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. ఈ సోదాల్లో భయంకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. మల్లాపూర్ లోని అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం పైన ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. భయంకరమైన నిజాలతో వెంటనే దానిని సీజ్ చేయడం జరిగింది.. స్వీట్ షాపుల్లో మిగిలిపోయిన లేదా కాలం చెల్లిన స్వీట్స్ ని అన్నిటిని ఇక్కడికి చేర్చి వాటితో మళ్లీ కొత్త స్వీట్స్ తయారు చేసి అదే స్వీట్ షాప్ లోకి పంపిస్తున్నారు. కాలం చెల్లిన స్వీట్స్ ని రీసైకిల్ చేసి కొత్త స్వీట్స్ పై కొత్త లేబులింగ్ చేసి తిరిగి షాపుల్లోకి సప్లై చేస్తున్నారు.. దీంతో పాటు నాసిరకం వస్తువులను వాడుతున్నారు.. అపరిశుభ్రత మధ్యలో స్వీట్స్ ను తయారుచేసి సప్లై చేస్తున్నట్లు- ఫుడ్ సేఫ్టీ అధికారుల విచారణలో బయటపడింది ..దీంతో స్వీట్ షాపు స్వీట్ కర్మగారాన్ని వెంటనే అధికారులు సీజ్ చేశారు.. దాని లైసెన్సులు కూడా రద్దు చేస్తున్నట్లు- ప్రకటించారు. మల్లాపూర్ లో అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం లో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఈ దాడిలో, సరైన పరిశుభ్రత మరియు పారిశుధ్య నిర్వహణ లోపం, ఆహార పదార్థాల లేబులింగ్, రికార్డుల గడువు ముగిసిన ఆహార పదార్థాలను చూసి అవాక్కు అయ్యారు. గడువు ముగిసిన స్వీట్లను మళ్లీ కొత్త స్వీట్లు- తయారీలో వాడటన్ని, పరిశుభ్రత లేని ప్రదేశంలో తయారు చేయడం అధికారులు గుర్తించారు. వేరే జిల్లా లో తీసుకున్న లైసెన్సుతో మల్లాపూర్ లో పరిశ్రమను ఏర్పాటు చేయడం పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు క్యాన్సల్ చేస్తున్నామని తెలిపారు. శాంపిల్ ను సేకరించి ల్యాబ్ కు పంపిస్తున్నమని తెలిపారు.

# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

4 శనివారం 29 మార్చి 2025


# మయన్మార్, థాయిలాండ్‌లోభారీ భూకంపం



**న్యూఢిల్లీ:** మయన్మార్, థాయిలాండ్ దేశాలు శుక్రవారం భారీ భూకంపం తాకిడికి విలవిలలాడాయి. రి క్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 7.7గా నమోదైంది. భూకం పం ధాటికి మయన్మార్‌లో 167 మంది మరణించారని, 300 మందికిపైగా గాయపడ్డారని తెలుస్తోంది. అయితే స హాయక చర్యల్లో భాగంగా శిథిలాలను తొలగిస్తున్నారు. దీంతో మరికొందరు వాటికింద ఉండే అనుమానం ఉం దని భావిస్తున్నారు. భారీ భవనాలు నేలమట్టం కాగా, శిథి లాల కింద వందలాది మంది చిక్కుకున్నట్లు వార్తా కథనా లు వెలువడతున్నాయి. జనం వీధుల్లో, రోడ్లపైనే బిక్కుబిక్కు మంటూ గడుపున్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ లో నిర్మాణంలో ఉన్న ఒక ఎత్తైన భవనం కుప్పకూలినప్పు డు కనీసం ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందగా, 90 మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. సహాయక సిబ్బంది ఇప్పటి వరకు ఏడు గురిని కాపాడారు. మయన్మార్‌లోనే నిమిషాల వ్యవధిలో ఆరు భూకంపాలు సంభవించాయి. ఈ భూకంపం ప్రభా వంతో భారత్, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లలో కూడా భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అయితే ఆయా దేశాల్లో భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4వరకు పరిమితం కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. మయన్మా ర్ రాజధాని నేపిడా, మాండలే సహా ఆరు ప్రాంతాలు, రాష్ట్రాల్లో ఎమర్జన్సీ ప్రకటించారు. భూప్రకంపల ప్రభావం తో రెండవ పెద్ద నగరం మాండలేలో ఐకానిక్ వంతెన కుప్ప కూలిపోయింది. నగరంలో భూప్రకంపన తీవ్రత 6.4గా నమోదైంది. దేశంలో పలు చోట్ల ఎత్తైన ప్రార్థనా మందిరాలు, గోపురాలు కూలిపోయాయి. భూకంపం నేపథ్యంలో మయన్మార్ సైనిక ప్రభుత్వం అంతర్జాతీయ సాయం కోరింది. మానవతా దృక్పథంతో సాయం అందజేయాలని ప్రపంచ దేశాలకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసిం ది. భూకంపం ప్రధాన కేంద్రం వాయవ్య నగరం సగా యింగ్‌లో 10 నుంచి 30 కిమీ లోతులో ఉన్నట్లు- యుఎ స్‌జిఎస్ తెలియజేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం భూకంపం వల్ల గణనీయ స్థాయిలో నష్టం సంభవించిం దని రెడ్ క్రాస్ తెలియజేసింది. 'మానవతావాద సాయం అవసరాలపై సమాచారం ఇంకా సమీకరిస్తున్నాం' అని సంస్థ తెలిపింది. బ్యాంకాక్‌లో కుప్పకూలిన భవనం ప్రదే శం నుంచి శిథిలాలు తన ట్రక్కును బలంగా తాకినప్పుడు ఒక నిర్మాణ కార్మికుడు దుర్మరణం చెందగా, శిథిలాల కింద మరొకరు నలిగిపోయినట్లు చెప్పాడు. మొత్తం ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు, 90 మంది గల్లంతైన ట్లు థాయిలాండ్ రక్షణ శాఖ మంత్రితెలిపారు. ప్రస్తుతం సాగుతున్న రక్షణ, సహాయ కార్యక్రమాల గురించి ఆయన ఇతర వివరాలు తెలియజేయలేదు. కానీ, కూలిపోయిన భవనం వెలుపల నుంచి ఇప్పటి వరకు ఏడుగురిని రక్షించినట్లు సహాయక సిబ్బంది తెలిపారు. బ్యాంకాక్‌కు ప్రముఖ చతుచాక్ మార్కెట్ సమీపంలో భవనం కూలిపోయినప్పటి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా, టాప్‌లో ఒక క్రేన్ ఉన్న బహుళ అంతస్తుల భవనం కుప్పకూలినప్పుడు దుమ్ముధూళి వ్యాపించగా, జనం కేకలు వేస్తూ పరుగులు తీయడం కనిపించింది. భూకం పం ధాటికి భవనాలు అటూ ఇటూ ఊగిపోవడంతో జనం రోడ్లపైకి పరుగులు పెట్టారు. బ్యాంకాక్‌లో ఇతర ప్రదేశాల్లో తమ భవనాల్లో నుంచి ఖాళీ చేయించిన ప్రజలను దూరంగా ఉండవలసిందని హెచ్చరించారు

## సంపాదకీయం



# నీతిమాలిన రాజకీయాలు పనిచేయవు!

ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం..ఎత్తులు పైఎత్తులు వేయడం....ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్ధాలు చెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం.. ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా.. ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు..నేతలు కావచ్చు...అందుకు దీటుగా ప్రచా రాస్త్రాలను సంధించాల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయా ల్సిందే. కొత్తగా నినాదాలు సిద్ధం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడు తుందా అన్నది కూడా ముఖ్యమే. అందుకే రాజకీయాల్లో విలువలకు తావులేకుండా పోతోంది. రాజకీయాల్లో విలువలు పతనం అయ్యాయి. అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు భ్రమిస్తున్నాయి. తామే మంచి చేశామని, చేస్తామని చెప్పకుంటూ పబ్బం గడుపుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలోకి పలుఉ వరు చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇంకా కొనసాగుతాయి. బిఆర్‌ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం బిఆర్‌ఎస్ అలుపెరుగని పోరాటం చేస్తోంది. ఉప ఎన్నికలు వస్తాయని కూడా హెచ్చరికలు చేస్తోంది. ఈ విషయంలో గతంలో ఉన్న చట్టాలే ఇప్పుడూ ఉన్నాయని, ఆనాడు లేని ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని సిఎం రేంవత్ రెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ వేదికగా కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. అయితే కోర్టు తీర్పులకు, లేదా హెచ్చరికలకు స్పీకర్ లోబడి ఉండాలా అన్న చర్చ సాగుతోంది. స్పీకర్ కూడా చట్టపరమైన అధికారంలో ఉన్నవారే. అసెంబ్లీకి సంబంధించి ఆయన నిర్ణయాలకే ప్రాధాన్యం ఉన్నాయి. మని సుప్రీం తీర్పు ఎలా ఉన్నా, అధికారపక్షం మాత్రం ధీమాగా ఉంది. ఇకపోతే ఎపిలో వైకాపా నుంచి అనేకమంది జారుకున్నారు. అధికార టిడిపిలో చేరారు. అక్కడో వెసలుబాటు ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు మూడూ కూటమిగా అధికారంలో ఉండడంతో మూడు పార్టీల్లోనూ చేరుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పార్టీలో చేరిపోతున్నారు. దీంతో ఏ పార్టీకి వచ్చిన నష్టం లేదు. ఎందుకంటే రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్షణ ఎక్కువ. సిద్ధాంత నిబద్ధతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని లెక్కలు వేసుకుంటున్నారు. రాజకీయాల్లో నేర్చుకున్న సిద్ధాంతం ఇది. ఈ సిద్ధాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. ఎపిలో కూటమి నేతలు అనుసరిస్తున్నా గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యేలను నిస్సిగ్గుగా టిఆర్‌ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ అంటూ ప్రచారం చేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్‌ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు.కానీ ప్రచారంలోనే అభివృద్ధిని చూపి అవినీతికి,అక్రమాలకు, అధికార దుర్విని యోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్‌ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్‌ఎస్, వైకాపా నేతల అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. అధికార మార్పుతో రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీనిని జీరి÷–ణించుకుని మంచి సంప్రదాయం పాటించి మళ్లీ ప్రజల్లో పేరు తెచ్చుకుని సాగాల్సి ఉంటుంది. సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈకాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది. ప్రజల అభిప్రాయాలను తీసుకుని చేసిన మంచిని ప్రజల ముందుంచడంతో పాటు అవినీతి మట్టి అంటుకోకుండా పాలన చేయాల్సి నేతలు , అధికారం దక్కగానే అవినీతి బురదలో కూరుకుపోతున్నారు. అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతిని సొంతం చేసుకున్నారు. అంతకు మించి ప్రజలతో మనకేమి సంబంధం అన్న రీతిలో వారిని దూరం పెట్టారు. ఒక సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని అహంకారం ప్రద్శించారు. అందుకే ప్రజలు తీర్పునిచ్చారు. వారివెంట ఉన్న బలగం అంతా మెల్లగా జారుకోవడం అన్నది కూడా సహజ పరిణామం. ఇది ఏ రాజకీయ పార్టీకైనా వర్తిస్తుంది. సచ్ఛీలతతో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాలి. తమ సిద్ధాంతాలను మార్చుకోవాలి. ప్రజల కోసం పోరాటాలు చేయాలి. కానీ జగన్ అదేపనిగా విమర్శలకే పరిమితం అయ్యారు. ఐదేళ్లలో పోలవరం ముందుకు కదదలేదు. అమరావతిని పక్కన పెట్టాడు. అనేకరకమైన లిక్కర్ బ్రాండ్లతో అవినీతికి తెరలేపారు. ఇవన్నీ ప్రజల ముందున్న సజీవ సాక్ష్యాలు. అందుకే అధికారం పోవడంతో రాజరికాన్ని భరించడం,తట్టుకోవడం సాధ్యం కాదు కనక ఒక్కొక్కరే జారుకుంటున్నారు. పోరాటాలతో మళ్లీ రాటుదేలితేనే ప్రజలు వెంటనడుస్తారు.

# బ్యాంకాక్ పర్యటనలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్

## భూకంపం నుంచి బయటపడ్డట్లు సమాచారం



**ప్రజానావ, హైదరాబాద్:** మయన్మార్‌లో శుక్రవారం మధ్యాహ్నం భారీ భూకంపాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ భూకంపాల ప్రభావం కారణంగా బ్యాంకాక్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి. ఛాతుచక్ జిల్లాలోని ఓ ఎత్తైన భవనం కుప్పకూలిపోయింది. ఈ నేపథ్యంలోనే బ్యాంకాక్ టూరులో ఉన్న రామగుండం ఎమ్మెల్యే కుటుంబం తృటిలో తప్పించుకుంది. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ తన కుటుం బంతో కలిసి ప్రస్తుతం బ్యాంకాక్ టూరులో ఉన్నారు. మక్కన్ సింగ్ ఫ్యామిలీ తిరుగుతున్న ప్రదేశంలోనూ భూప్రకంపనలు సంభవించినట్లు తెలుస్తోంది. అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడ్డారు. అంతేకాదు.. భూప్రకంపలు వచ్చిన ప్రదేశాల్లో ఇండియాకు చెందిన వాళ్లు పెద్ద మొత్తంలో ఉన్నట్లు సమాచారం.

# ప్రధాని మోడీ ఆరా

## మయన్మార్, థాయిలాండ్ దేశాలకు బాసట

**న్యూఢిల్లీ:** భూప్రకంపనలపై ప్రధాని మోడీ ఆరా తీశారు. మయన్మార్, థాయిలాండ్ భూకంపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మయన్మార్, థాయిలాండ్ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని ప్రధాని మోడీ విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరారు. సాధ్యమైన అన్ని సహాయాలను అందించడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే భారత్‌లోనూ భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదైనట్లుగా తెలుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ సహా కోల్‌కతా, రాంచీ, త్రిపుర, అస్సాం, పాట్నాలో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో భయంతో విద్యార్థులు, అధ్యాపకులు క్లాస్ రూమ్‌లోంచి బయటకు వచ్చేశారు. అలాగే అధికారులు కూడా కార్యాలయాల్లోంచి ఇళ్లకు వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# శనగ రైతులకు కేంద్రం ఊరట

## దిగుమతులపై 10శాతం సుంకం విధింపు

**న్యూఢిల్లీ, మార్చి 28 :** దేశంలో ఈ ఏడాది దేశీ శనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు చేరుకోవడంతో కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. దేశంలోని రైతులకు మేలు జరిగేలా ఏప్రిల్ 1 నుంచి వచ్చే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి శనగ దిగుమతులపై 10శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తూ నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం పాటించిన సుంకం లేని విధానాన్ని రద్దు చేస్తూ కేంద్రం చర్యలు చేపట్టింది. బదులుగా ఏప్రిల్ 1 నుండి దేశీ శనగపై 10దిగుమతి సుంకాన్ని తిరిగి ప్రవేశపెట్టింది. దేశంలో ఈ ఏడాది చనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నందున ఈ చర్యలకు ఉపక్రమించాల్సి వచ్చిందని కేంద్రం చెబుతోంది. ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చేలా దేశీ శనగ పై ప్రభుత్వం 10శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. గత సంవత్సరం మే నెలలో, దేశీయ లభ్యతను పెంచడానికి, ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం సుంకం లేని శనగ దిగుమతిని అనుమతించింది. దిగుమతి సుంకం మినహాయింపు మార్చి 31, 2025 వరకు వర్తిస్తుంది. ఈ మార్పుకు సంబంధించి ఈ నెల 27న ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ డేటా ప్రకారం, చనగ ఉత్పత్తి 2024-25లో 11.5 మిలియన్ టన్నులుగా అంచనా వేశారు. అయితే, ఇది గతేడాది ఇది 11 మిలియన్ టన్నులు.

# భద్రాచలం ప్రభుత్వ దవాఖాన వద్ద ఉద్రిక్తత

## భవనం కూలిన ఘటనలో న్యాయం చేయాలని ఆందోళన



**ప్రజానావ, భద్రాచలం :** భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కిందపడి చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కుల సంఘాలు, వామపక్ష, కుల సంఘా నాయకులు, తాపీమేస్త్రి ఉపేందర్ బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే మృతదేహాలకు పోస్టుమార్టం చేయాలని ప్రభుత్వ దవాఖాన మార్చురీ ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్‌కు చేరుకున్నారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్థుల భవనం బుధవారం కూలిన ఘటన విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద చిక్కుకుని తాపీమేస్త్రి ఉపేందర్, కార్మికుడు కామేశ్వర్‌రావు మృతిచెందారు. గురువారం శిథిలాల్లో చిక్కుకుపోయిన తాపీమేస్త్రి కామేశ్వర్‌రావును అధికారులు ప్రాణాలతో బయటకుతీశారు. కానీ అప్పటికే కాలు, చెయ్యి నుజ్జునుజ్జయి, తీవ్ర రక్తస్రావం జరిగిన కామేశ్వర్‌రావు దవాఖానకు తరలించిన వెంటనే ప్రాణాలు వదిలాడు. శుక్రవారం ఉదయం ఉపేందర్ మృతదేహాన్ని శిథిలాల కిందినుంచి రెస్క్యూ సిబ్బంది వెలికి తీసింది. పోస్టుమార్టం అనంతరం ఉపేందర్ డెడ్‌బాడీని ఆయన కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు.

# మరోమారు ప్రధాని మోడీ విదేశీ పర్యటన

## వచ్చే నెలలో థాయిలాండ్, శ్రీలంక షెడ్యూల్



**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వచ్చేనెల ఏప్రిల్లో విదేశీ పర్యటనకు థాయ్‌లాండ్, శ్రీలంక దేశాలకు వెళ్లనున్నారు. ఏప్రిల్ 3-4 తేదీల్లో థారులాండ్ ఆతిథ్యం ఇస్తున్న ఆరవ బిఐఎంఎస్‌టిఇసి (శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనగడానికి బ్యాంకాక్‌లో పర్యటించనున్నట్లు- భారత విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం వెల్లడించింది. అనంతరం మోడీ ఏప్రిల్ 4-6 వరకు శ్రీలంకలో పర్యటించనున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకతో మోడీ చర్చలు జరపున్నట్లు- భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ రెండు దేశాల పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైనట్లు- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ముందుగా ఏప్రిల్ 3 - 4 తేదీల్లో ప్రధాని థాయ్‌లాండ్‌లో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రఆహ్వానం మేరకు ఆ దేశ పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ సందర్భంగా పేటోంగ్టార్న్‌తో భేటీ కానున్నారు. ఏప్రిల్ 4వ తేదీన బ్యాంకాక్‌లో జరగనున్న 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్'కూటమి సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టు-బడులు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలంపై దేశాధినేతలతో చర్చించనున్నారు. ఆ తర్వాత థాయ్‌లాండ్ పర్యటనను ముగించుకొని ప్రధాని ఏప్రిల్ 4న శ్రీలంక వెళతారు. ఏప్రిల్ 6వ తేదీ వరకూ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు అనురకుమార దిసనాయకే గతేడాది భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఆహ్వానం మేరకు మోదీ శ్రీలంక పర్యటనకు వెళ్లబోతున్నారు. మోదీ తన పర్యటనలో రెండు దేశాల మధ్య కుదిరిన పలు ఒప్పందాలపై చర్చించనున్నారు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

శనివారం
29 మార్చి 2025




# మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి




- జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య
- వేములవాడ టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా తొగరి కరుణాకర్ నియామకం

**ప్రజానావ, వేములవాడ:** రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కరానికి వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలతో పాటు మీడియాలో వస్తున్న అనారోగ్యకమైన భాష నియంత్రణకు రిటైర్డ్ జడ్జీతో మీడియా కమిషన్ అవసరమని అన్నారు. శుక్రవారం వేములవాడలోని మున్నూరుకాపు సంఘం భవన్‌లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ వేములవాడ నియోజకవర్గం మహాసభలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. పాత్రికేయ సంఘాలు పాలకుల పక్షం ఉండకుండా ప్రజల పక్షం, పాత్రికేయుల పక్షం ఉండాలన్న లక్ష్యంతో ఫెడరేషన్ జర్నలిస్టుల పక్షాన పోరాడుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడబ్ల్యూజేఎఫ్ నెంబర్ వన్ యూనియన్ గా బలపడుతుందని అన్నారు. ఐఏఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, ఇప్పటికే మూడుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు అండగా నిలిచే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మాత్రమే అని అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వ పదవుల కోసం, అక్రమ సంపాదన కోసం పాకులాడే సంఘాల పట్ల జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని సంఘాలు జర్నలిస్టుల సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వాలకు కొమ్ము కాస్తున్నాయని ధ్వజమెత్తారు. టీడబ్ల్యూజేఎఫ్ ప్రజాస్వామ్యబద్ధంగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడే యూనియన్ అని అన్నారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, రాజన్న-సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెరుక రవి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. వేములవాడ నియోజకవర్గం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు వినతిపత్రం ఇవ్వాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడేషన్లు ఇవ్వాలని కోరుతూ మహాసభ తీర్మానించింది.

### వేములవాడ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వేములవాడ నియోజకవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేములవాడ నియోజకవర్గం టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ అధ్యక్షుడిగా తొగరి కరుణాకర్, కార్యదర్శిగా సుంకరి నరేందర్, కోశాధికారిగా బొప్ప భిక్షపతి, ఉపాధ్యక్షులుగా అవధూత శ్రీధర్, కవ్వాల సురేందర్, ఎండీ షరీఫ్, సహాయ కార్యదర్శులుగా గొల్లపల్లి వేణు, కోటగిరి రాజశేఖర్, గోపు ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా చల్లా రమేశ్, వాసం వెంకటస్వామి, ఎగుమంటి మూర్తిరెడ్డి, కళ్యాడపు వెంకటమల్లు, చక్రహరి దేవేందర్ రాజు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, నడిగట్ల భిక్షపతి, సయ్యద్ షబ్బీర్‌లను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# ఎన్నికల నిర్వహణకు సలహాలు అందించాలి




- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

**ప్రజానావ, సిరిసిల్ల:** పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఓటర్ జాబితా సవరణ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు .సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో కంటే నిర్వహించిన ఎన్నికల కంటే మెరుగ్గా రాబోయే రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు, అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు వినూత్న కార్యక్రమాలు అమలుకు, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాల పట్ల ప్రతి ఒక్క సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికీ తమ పాత్ర పట్ల , విధులు గురించి పూర్తిగా తెలిసి ఉండాలని అన్నారు. సజావుగా శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి సలహాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధాబాయి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్ల్యూజేఐ ఉగాది పంచాంగం ఆవిష్కరించిన మంత్రులు



**ప్రజానావ, హైదరాబాద్:** వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) రూపొందించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగం/దైనందినిని రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ లో డబ్ల్యూజేఐ ప్రతినిధులు వారిని కలిసి జర్నలిస్టుల సంక్షేమానికి యూనియన్ చేపట్టిన, చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. సమస్యల పరిష్కారానికి సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా మంత్రులు పాత్రికేయులకు, ప్రజలకు తెలుగు వత్సర శుభాభినందనలు తెలిపారు. సమస్యలపై పోరాటంలో తాము జర్నలిస్టుల వెంట కలిసి నడుస్తామని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ, ప్రధాన కార్యదర్శి నరేంద్ర భండారి, సీనియర్ ఉపాధ్యక్షుడు సంజయ్ సక్సేనాలు తమ సందేశాల్లో పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు, పాత్రికేయులకు వారు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పంచాంగం/దైనందిని ఆవిష్కరణ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నందనం కృపాకర్, అధ్యక్షుడు రాణాప్రతాప్ రజ్జూభయ్యా , ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, కార్యదర్శి క్రాంతి ముదిరాజ్, నగర అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.



# గల్ఫ్ కార్మికుడికి విప్ ఆపన్న హస్తం

### కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు



**ప్రజానావ, భీమారం:** జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన జమ్మికుంట మహేందర్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సంబంధిత సమస్యపై వైద్యులను సంప్రదించగా కిడ్నీ మార్పిడి చేయాల్సిందిగా వైద్యులు తెలపగా అనారోగ్య సమస్యలతో అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తెలియజేయగానే తక్షణమే స్పందించారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు రూ. 5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేపించారు. అత్యవసర ఆరోగ్య చికిత్స నిమిత్తం ఎల్‌ఓసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజలకు సమర్ధవంతమైన సేవలందించాలి

### సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టిసారించాలి

### చందుర్తి, రుద్రంగి పోలీస్ స్టేషన్లు సందర్శించిన ఎస్పీ మహేశ్ బి గితే



**ప్రజానావ, చందుర్తి:** చందుర్తి సర్కిల్ కార్యాలయం, చందుర్తి , రుద్రంగి పోలీస్ స్టేషన్లతో పాటుగా రుద్రంగి మానాల చెక్‌పోస్ట్, లింగంపేట గ్రామ శివారులో ఉన్న పోలీస్ అమరవీరుల స్తూపాన్ని శుక్రవారం సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బి గితే సందర్శించారు. అనంతరం పోలీస్ స్టేషన్ల పరిసరాలు, సిబ్బంది పని తీరు, సర్కిల్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందజేస్తూ సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరుచూ గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌తో కలిగే కలుగు అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. స్టేషన్ల పరిధిలో ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహనల తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతూ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అశోక్, అంజయ్య, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

**ప్రజానావ, పెంచికల్‌పేట్:** అక్ర మంగా పశువులను తరలిస్తున్న వాహ నాన్ని శుక్రవారం ఎలకపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఉదయం 5 గంటల ప్రాంతంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య వివరాల ప్రకా రం.. బెజ్జూర్ మండలం మర్తిడి గ్రా మం నుంచి హుస్నాబాద్ ఎద్దుల అంగడికి తరలిస్తున్న ఐదు ఎద్దులు, రెండు దున్నపోతులను తరలిస్తున్న వాహనాన్ని నమ్మదగిన సమాచా రం మేరకు శుక్రవారం ఉదయం 5 గం టల ప్రాంతంలో పట్టుకున్నారు. కరీం నగర్‌కు చెందిన జాఫర్, మహ్మద్ ర ఫీ, బెజ్జూర్ మండలం కుకుడ గ్రామా నికి చెందిన శ్రీశైలం అనే ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



**ప్రజానావ, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంట్ ను శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజస్వ మండల అధికారి కార్యాలయనికి వివిధ పనుల నిమిత్తం ఎంతోమంది ప్రజలు వస్తుంటారని, వారి సౌకర్యార్థం దాదాపు 40 వేల రూపాయల వ్యయంతో రాజస్వ అధికారి శ్రీనివాసరావు, ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు చిర్ర రాజు, పాంపాటి అనిల్ ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ గంటకు 80 లీటర్ల నీటిని తాగడానికి అందిస్తుందని ఫౌండేషన్ వారి సేవాభావాన్ని కలెక్టర్ అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

6 శనివారం 29 మార్చి 2025

# రెవెన్యూ వ్యవస్థలో నూతనోత్సాహం




**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** ప్రజా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతోనే రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో నూతనోత్సాహం వచ్చిందని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ.లచ్చిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో రైతులకు మెరుగైన సేవలు అందడంతో పాటు, రెవెన్యూ ఉద్యోగులకు భారీగా పదోన్నతులు వస్తున్నాయన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలన అధికారులను నియామకం చేయడం వలన రైతులకు రెవెన్యూ సేవలు చెరువ కావడంతో పాటు రెవెన్యూ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు లభిస్తున్నాయన్నారు. దీంతో క్రమంగా రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. అయితే భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలన్నారు. శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ లో జరిగింది. టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ చైర్మన్ వీ.లచ్చిరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖ బలోపేతం కావడంతో పాటు రైతులకు గ్రామ స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా నియామకం చేస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల ఆకాంక్షకు ప్రభుత్వ సహకారం తోడవడంతో రెవెన్యూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సాధించుకున్నామన్నారు. అయితే రాష్ట్రంలో లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు రెవెన్యూ ఉద్యోగులు అత్యంత బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వ సహకారంతో దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాదించామన్నారు. అలాగే గతంలో ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు. కానీ త్వరలోనే అమల్లోకి రాబోతున్న భూ భారతి చట్టంలో తహశీల్దార్లకు ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుంచి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. నాడు రైతులకు, ప్రజలకు దూరాభారమైన రెవెన్యూ సేవలు త్వరలోనే గ్రామ స్థాయిలోనే అందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గం, రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ పెద్దల, ఉన్నతాధికారుల అందరి సహకారంతో అనతి కాలంలోనే అనేక చారిత్రిక విజయాలను తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సొంతం చేసుకోవడం జరిగిందన్నారు.

- రైతులకు మెరుగైన సేవలు, ఉద్యోగులకు భారీగా పదోన్నతులు
- గ్రామ పరిపాలన అధికారుల నియమకంతో రైతులకు చేరువైన రెవెన్యూ సేవలు
- ఇందులో భాగంగానే 10,954 మంది జీపీవోల నియామకం
- గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేర్చే బాధ్యత జీపీవోలదే
- ఉమ్మడి నల్లగొండ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వీ.లచ్చిరెడ్డి



### క్షేత్రస్థాయికి రెవెన్యూ సేవలు..

గతంలో తెలంగాణ ప్రాంతంలో రెవెన్యూ వ్యవస్థ గ్రామ సచివాలయ కేంద్రంగా ఉండేది. భూ రికార్డులు కూడా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఉండేవి. రైతులకు ఏ భూ సమస్య వచ్చినా గ్రామ స్థాయిలోనే పరిష్కారం అయ్యేది. కానీ ఎన్టీఆర్ ప్రభుత్వంలో రెవెన్యూ పరిపాలన సంస్కరణలతో పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ వ్యవస్థను మండల కేంద్రాలకు మార్చారు. తదనంతరం రాజశేఖర్ రెడ్డి మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించారు. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన భూ సంస్కరణలతో ఏకంగా భూ సమస్యల పరిష్కార వేదిక జిల్లా కేంద్రానికి చేరడంతో రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ గ్రామీణ స్థాయి రెవెన్యూ వ్యవస్థ క్రమంగా బలోపేతం అవుతుందని లచ్చిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించడంతో పాటు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సంఖ్యను పెంచడం, గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామానికో అధికారి చొప్పున 10,954 జీపీవో పోస్టుల ఏర్పాటు మనకు అతిపెద్ద విజయాలుగా లచ్చిరెడ్డి అభివర్ణించారు. అలాగే జీఓ నం.317 రాష్ట్రంలో ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిందన్నారు. ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్ లు ఇచ్చారన్నారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా ఉద్యోగుల ఆంక్షలను, 317 జీవోలోని నిబంధనలను ప్రభుత్వం సడలించిందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ప్రముఖ వాగ్గేయకారుడు, తెలంగాణ ఉద్యకారుడు ఏపూరి సోమన్న ఆటాపాటలు సభికులను ఉత్సాహపర్చాయి. ఈ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, కోశాధికారి వెంకట్ రెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వీ.భిక్షం, కోశాధికారి మల్లేశం, పూర్వపు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేందర్ రావు, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎస్డీసీ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, టీజీటీఏ సెక్రటరీ జనరల్ పూల్ సింగ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షులు పి.రాధ, టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చిల్ల శ్రీనివాస్ తదితరులున్నారు.



## లోడుపల్లిలో నీల్గాయి వేట

**అటవీ అధికారుల అదుపులో ఇద్దరు ● పరారీలో నలుగురు నిందితులు**

**ప్రజానావ, పెంచికల్‌పేట్:** ఆరుగురు వేటగాళ్లను పెంచికల్‌పేట్‌రేంజ్‌అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో విస్వసనీయ సమాచారం మేరకు లోడుపల్లి అటవీ సెక్షన్ పరిధిలో నీల్గాయి వేట జరిగినదనే సమాచారం అటవీశాఖ అధికారులు దాడు చేశారు. చాపిడే వెంకటేష్(కొండపల్లి), ఆత్రం రవి(కొండపల్లి), గొర్లపల్లి మొండి, ఆత్రం భీమయ్య, దుర్గం రవీందర్ ను వేటలో పాల్గొన్నట్టు గుర్తించారు. దుర్గం రవీందర్, చప్పిడి వెంకటేష్ ను అదుపులోని తీసుకొని విచారిస్తుండగా, మిగతా వారు తప్పించుకొని పరారైనట్టు అధికారులు తెలిపారు. కేసును పూర్తిస్థాయిలో విచారిస్తామని పేర్కొన్నారు. కాగా, దుర్గం రవీందర్ మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ మేరగూడలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నట్టు తెలిసింది. ఈ దాడుల్లో ఎఫ్‌బీవోలు సంగదీప్, సతీష్, లచ్చన్న, మనోహర్, శంకర్, అనిమల్ ట్రాకర్, శ్రీకాంత్, వెంకటేష్ పాల్గొన్నారు

## కౌటాలలో ఇఫ్తార్ విందు

**ప్రజానావ, కౌటాల :** రంజాన్ ఉపవాసాలు పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం కౌటాల మండల కేంద్రంలోని జామియా మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, సీనియర్ నాయకులు బండి రాజేందర్ గౌడ్, నాయకులు నయీమ్ అహ్మద్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## దొంగకు దేహశుద్ధి

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ దేవస్థానం, మున్సిపల్ కార్యాలయానికి చెందిన ఎలక్ట్రిక్ వైర్లను గత కొంతకాలంగా దొంగతనం చేస్తున్న వ్యక్తిని శుక్రవారం దేవస్థాన సిబ్బంది పట్టుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దొంగతనం చేసిన వ్యక్తిని కోరుట్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు.



## గోర్ బోలి భాషకు ప్రభుత్వ గుర్తింపుపై హర్షం

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో లంబాడీస్ బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు గిరిజన నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం లైవ్ రాష్ట్ర ఇన్‌చార్జి బాణోత్ నరేశ్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం గోర్ బోలి లంబాడీలా భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దేశంలో సుమారు 15 కోట్ల జనాభా, రాష్ట్రంలో సుమారు 40 లక్షల జనాభా కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే దేశంలో 700పై భాషలు ఉన్నాయని, అందులో కేవలం 22 భాషలు మాత్రమే షెడ్యూల్ 8లో చేర్చబడ్డాయన్నారు. షెడ్యూల్‌లో చేర్చడం వల్ల మా సంస్కృతి, సాంప్రదాయాలు రక్షించబడడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని, యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, స్కాలర్లుగా అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం రెండు శాతం మాట్లాడే సంస్కృతం భాషను షెడ్యూల్ 8లో చేర్చినా తమ గిరిజన గోర్ బోలి భాషను విస్మరించారన్నారు. ఇప్పటికైనా కేంద్రమంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కిషన్ రెడ్డి,పార్లమెంట్లో బిల్లు పాస్ అయ్యే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వల్య నాయక్, రాజు నాయక్, కిషన్ నాయక్, పంతుల్ నాయక్, ప్రకాశ్ నాయక్, రాజు బల్కర్, తిరుపతి, రమేశ్, మదన్ నాయక్, మోహన్, అమృతల్, పరంగి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత




**రాజన్న సిరిసిల్ల జిల్లా కోఆర్డినేటర్ అవేజ్**

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిదాన్ పాదయాత్ర సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ కోఆర్డినేటర్ జిల్లా ఇంచార్జ్ మహమ్మద్ అవేజ్ మండల ఇంచార్జ్ గడ్డం నర్సయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ అవేజ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. మహాత్మగాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికై 100ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కోసం దేశ వ్యాప్తంగా ఏఐసీసీ పిలుపు మేరకు ప్రతి కార్యకర్త పాదయాత్రలో పాల్గొనాలన్నారు. దేశ స్వాతంత్రం కోసం రాజ్యాంగ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని ప్రజలకు వివరిస్తూ బీజేపీ విభజన రాజకీయాలను ఎండగట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, జిల్లా కార్యదర్శులు చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్, డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దెబ్బకొట్టిన దూకుడు మంత్రం

## కొంపముంచిన తప్పిదాలు

**ప్రజానావ, హైదరాబాద్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఊహించని పరాజయం ఎదురైంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో గురువారం ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. అసాధారణ బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను తక్కువ స్కోర్‌కు కట్టడి చేసిన లక్నో సూపర్ జెయింట్స్.. ఆ తర్వాత విధ్వంసకర బ్యాటింగ్‌తో అలవోక విజయాన్నందుకుంది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాబ్ బలమే.. బలహీనమైంది. దూకుడు మంత్రం దెబ్బకొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో విఫలమైన ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. లీగ్ ఆరంభంలోనే ఎదురైన ఈ పరాజయం సన్‌రైజర్స్ హైదరాబాద్ లుకలకలను భయటపెట్టింది. నికోలస్ పూరన్ విధ్వంసంతో పాటు లక్నో సూపర్ జెయింట్స్ అద్భుత బౌలింగ్.. పతనాన్ని శాసించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కాస్త అదృష్టం కూడా కలిసి రాలేదు. బౌలింగ్ విభాగం వైఫల్యంతో పాటు ప్రత్యర్థి బ్యాటర్లకు తగిన ప్రణాళికలు రచించకపోవడం సన్‌రైజర్స్ ఓటమికి కారణమయ్యాయి. ఇన్నింగ్స్ ఆరంభంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను శార్దూల్ ఠాకూర్ దెబ్బతీసాడు. మూడో ఓవర్‌లోనే ఓపెనర్ అభిషేక్ శర్మ(6), గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్ కిషన్(0) వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చాడు. దాంతో సన్‌రైజర్స్ పరుగుల విధ్వంసానికి గండి పడింది. ప్రణాళిక బద్దంగా ఫుల్లర్ లెంగ్త్ డెలివరీలతో ఈ ఇద్దరి బ్యాటర్లను శార్దూల్ ఠాకూర్ ఔట్ చేశాడు. ఈ ఇద్దరిలో ఒకరు పవర్ ప్లే పూర్తయ్యేవరకు ఆడినా ఫలితం మరోలా ఉండేది. ఆరంభంలో రెండు వికెట్లు కోల్పోయినా... నితీష్ కుమార్ రెడ్డి సాయంతో ట్రావిస్ హెడ్ తనదైన శైలిలో చెలరేగి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. కానీ ట్రావిస్ హెడ్‌కు నితీష్ కుమార్ రెడ్డి నుంచి సరైన సహకారం లభించలేదు. బౌండరీలు బాదడంలో నితీష్ కుమార్ రెడ్డి తడబడ్డాడు. మరోవైపు దూకుడుగా ఆడిన ట్రావిస్ హెడ్‌ను ప్రిన్స్ యాదవ్ స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేశాడు. అనంతరం హెన్రీచ్ క్లాసెన్‌ను రనౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. నితీష్ కుమార్ రెడ్డి ఇచ్చిన రిటర్న్ క్యాచ్ అందుకునే క్రమంలో ప్రిన్స్ యాదవ్ చేతుల నుంచి జారిన బంతి నాన్‌స్ట్రైకర్ వికెట్లను తాకింది. దాంతో హెన్రీచ్ క్లాసెన్ దురదృష్టవశాత్తు రనౌట్‌గా వెనుదిరిగాడు. క్లాసెన్ కాసేపు ఉన్నా.. ట్రావిస్ ఔటవ్వకపోయినా.. సన్‌రైజర్స్ అదనంగా మరో 30 పరుగులు చేసేది. అప్పుడు ఫలితం మరోలా ఉండేది. నికోలస్ పూరన్ విధ్వంసకర బ్యాటింగ్ సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. మార్క్‌రమ్ త్వరగానే ఔటైనా.. మిచెల్ మార్ష్‌తో కలిసి పూరన్ ఆకాశమే హద్దుగా చెలరగాడు. సిమర్జిత్ సింగ్ వేసిన తొలి ఓవర్‌లో 17 పరుగులు పిండుకున్న పూరన్.. 7-10 ఓవర్ల మధ్య ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆడమ్ జంపా ఓవర్‌లో 19, హర్షల్ పటేల్ బౌలింగ్‌లో 15 పరుగులు బాది 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. మిచెల్ మార్ష్‌తో కలిసి అతను 43 బంతుల్లోనే 116 పరుగుల భాగస్వామ్యం జోడించి లక్నో విజయానికి బాటలు వేసాడు. లక్నో బ్యాటర్లను కట్టడి చేయడంలో సన్‌రైజర్స్ బౌలర్లు తేలిపోయారు. దాంతో లక్నో పవర్ ప్లేలోనే 77 పరుగులు చేసింది. ముఖ్యంగా పూరన్‌ను కట్టడి చేయలేకపోయాడు. మిడ్ వికెట్, డీప్ మిడ్ వికెట్ దిశగా ఎక్కువగా షాట్స్ ఆడిన అతన్ని అడ్డుకోలేకపోయారు. లక్నో బ్యాటర్లకు తగ్గట్లు బౌలింగ్ వేయడంలో సన్‌రైజర్స్ బౌలర్లు తడబడ్డారు. చివరకు పూరన్, మార్ష్‌ను కమిన్స్ ఔట్ చేసినా.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆరంభంలోనే పూరన్‌ను ఔట్ చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది.

# 17ఏళ్ల తర్వాత..!

## • చరిత్ర సృష్టించిన ఆర్సీబీ • చెన్నైపై చారిత్రాత్మక విజయం



**చెన్నై:** ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆర్‌సీబీ గెలిచి చరిత్ర సృష్టించింది. పటిష్టమైన చెన్నై సూపర్ కింగ్స్‌తో శుక్రవారం చెన్నై వేదికగా ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆర్‌సీబీ 50 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. 2008 తర్వాత చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా ఆర్‌సీబీ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. రజత్ పటీదార్(32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. ఫిల్ సాల్ట్(16 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 32), విరాట్ కోహ్లీ(30 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 31) రాణించారు. చివర్లో టీమ్ డేవిడ్(8 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 22 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్(3/36) మూడు వికెట్లు తీయగా.. మతీష పతీరణ(2/36) రెండు వికెట్లు పడగొట్టాడు. ఖలీల్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్ తలో వికెట్ తీసారు. చెన్నై సూపర్ కింగ్స్ పేలవ ఫీల్డింగ్ ఆర్‌సీబీకి కలిసొచ్చింది. రజత్ పటీదార్ ఇచ్చిన మూడు క్యాచ్‌లను చెన్నై ఆటగాళ్లు నేలపాలు చేశారు. సామ్ కరణ్ వేసిన ఆఖరి ఓవర్‌లో టీమ్ డేవిడ్ వరుసగా మూడు సిక్సర్లు బాది మ్యాచ్‌ను ఆర్‌సీబీ వైపు మలుపు తిప్పాడు. అనంతరం సీఎస్‌కే.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులే చేసి ఓటమిపాలైంది. రచిన్ రవీంద్ర(31 బంతుల్లో 5 ఫోర్లతో 41), మహేంద్ర సింగ్ ధోనీ(16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలవగా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఆర్‌సీబీ బౌలర్లలో జోష్ హజెల్ వుడ్(3/21), యశ్ దయాల్(2/18), లియ-ఎమ్ లివింగ్ స్టోన్(2/28) రెండేసి వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్(1/20) ఓ వికెట్ పడగొట్టాడు.



**హజెల్ వుడ్ సూపర్ స్పెల్..**

లక్ష్య చేధనలో సీఎస్‌కే ఆశించిన శుభారంభం దక్కలేదు. జోష్ హజెల్‌వుడ్ ఒకే ఓవర్‌లో రాహుల్ త్రిపాఠి(5)తో పాటు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(0)ను పెవిలియన్ చేర్చాడు. దీపక్ హుడా(4)ను భువనేశ్వర్ కుమార్ ఔట్ చేయడంతో సీఎస్‌కే బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ఆచితూచి ఆడటంతో పవర్ ప్లేలో సీఎస్‌కే 3 వికెట్లకు 30 పరుగులే చేసింది. ఈ సీజన్‌లోనే ఇది లోయెస్ట్ పవర్ ప్లే స్కోర్. అనంతరం రచిన్ రవీంద్ర బౌండరీలతో వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. కానీ మరో ఎండ్‌లో సామ్ కరణ్(8)ను లివింగ్ స్టోన్ పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే భారీ సిక్స్ బాదాడు. స్పిన్నర్లను అలవోకగా ఆడుతుండటంతో.. యశ్ దయాల్‌ను రంగంలోకి దింపిన రజత్ పటీదార్ ఆశించిన ఫలితాన్ని రాబట్టాడు. క్రీజులో సెట్ అయిన రచిన్ రవీంద్ర(41)తో పాటు, శివమ్ దూబే(19)లను ఒకే ఓవర్‌లో యశ్ దయాల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో సీఎస్‌కే ఓటమి ఖాయమైంది. అశ్విన్(11) సైతం నిరాశపరిచాడు. లివింగ్ స్టోన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. చివర్లో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీ.. జడేజాతో కలిసి బౌండరీలు బాదాడు. జడేజా సైతం తనదైన షాట్లతో అలరించాడు. కానీ అతన్ని జోష్ హజెల్ వుడ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆఖరి ఓవర్‌లో ధోనీ వరుసగా రెండు సిక్స్‌లు బాదడంతో పాటు ఓ బౌండరీ బాది అభిమానులను అలరించాడు.

# ధోని వల్ల సీఎస్‌కే ఆటగాళ్లు ఇలా ఇబ్బంది పడుతున్నారు!

## అంబటి రాయుడు సంచలన వ్యాఖ్యలు

**ప్రజానావ, హైదరాబాద్:** ఎంఎస్ ధోనికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతని ఆట చూసేందుకు కొన్ని లక్షల మంది స్టేడియానికి వస్తుంటారు. తాజాగా ఐపీఎల్ 2025లో కూడా ధోని కోసమే స్టేడియానికి వస్తున్న వాళ్లు, టీవీల ముందు కూర్చుంటున్న వాళ్లు చాలా మందే ఉన్నారు. శుక్రవారం ఆర్సీబీతో సీఎస్‌కే చెపాక్ వేదికగా మ్యాచ్ ఆడనుంది. అయితే ఈ మ్యాచ్‌కి ముందు సీఎస్‌కే మాజీ ఆటగాడు అంబటి రాయుడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ధోని కారణంగా సీఎస్‌కే ఆటగాళ్లు చాలా ఇబ్బందికి గురి అవుతూ ఉంటారని, ఇది చాలా కాలంగా జరుగుతుందని, ఎవరూ దీని గురించి బహిరంగంగా చెప్పరని, కానీ, లోపల మాత్రం కుమిలిపోతుంటారంటూ రాయుడు పేర్కొన్నాడు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో వైరల్‌గా మారాయి.

ధోని అంటే సీఎస్‌కే, సీఎస్‌కే అంటే ధోని అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ధోనిని చూసే 90 శాతం మంది సీఎస్‌కే టీమ్‌కు సపోర్ట్ చేస్తారు. అతి ఆ ప్రేమ కొన్ని సందర్భాల్లో లైన్ దాటుతుందనే ఉద్దేశంతో రాయుడు ఈ వ్యాఖ్యలు చేశాడు. ఇటీవలె ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ధోని బ్యాటింగ్‌కు వచ్చాడు ఓ రెండు బంతులు ఎదుర్కొని, రన్స్ ఏమీ చేయకుండా నాటౌట్‌గా నిలిచాడు. మరో ఎండ్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని, చివర్లో ఒక సిక్స్‌తో రచిన్ రవీంద్రా మ్యాచ్‌ను ముగించాడు. ఇది ధోని అభిమానులకు కోసం తెప్పించింది. చివర్లో ధోనికి స్ట్రైక్ ఇవ్వకుండా మ్యాచ్ ఎందుకు ముగించావ్ అంటూ రచిన్ రవీంద్రాను సీఎస్‌కే అభిమానులు తిట్టడం స్టార్ట్ చేశారు. ఇలాంటి వింత అనుభవాలు గతంలో చాలా మంది సీఎస్‌కే ఆటగాళ్లకు ఎదురైనట్లు రాయుడు పేర్కొన్నాడు. ధోని బ్యాటింగ్ చూసేందుకు అప్పటి వరకు ఆడుతున్న ఆటగాళ్లు అవుట్ అవ్వాలని కూడా సీఎస్‌కే అభిమానులు కోరుకుంటారు, అందుకోసం స్టేడియంలో గట్టిగా అరుస్తారు కూడా అంటే వెల్లడించాడు. ఇది చాలా ఇబ్బంది కరంగా ఉంటుందని అన్నాడు. అయితే.. ధోనిని వాళ్లు ఇంతలా ప్రేమించడంలో తప్పేమి లేదని, సీఎస్‌కే టీమ్‌ను నిర్మించడంలో ధోని ఎంతో కష్టపడ్డాడని, ఇన్నేళ్ల నుంచి సీఎస్‌కేను ఒక సక్సెస్‌ఫుల్ టీమ్‌గా తీర్చిదిద్దాడంటూ రాయుడు వెల్లడించాడు.


ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

శనివారం

29 మార్చి 2025




# 2 మ్యాచ్‌ల్లోనే 6 వికెట్లతో పర్పుల్ క్యాప్

## సత్తా చాటుతున్న శార్దూల్ ఠాకూర్



**న్యూఢిల్లీ:** శార్దూల్ ఠాకూర్.. ఈ సీజన్ లో ఈ పేరు టాక్ ఆఫ్ ద టౌన్ మాదిరిగా అయిపోయింది. నిజానికి గత ఐదు నెలలుగా తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు అనుభవించాడు. గోడకు కొట్టిన బంతిలా ఎగిసి, రివ్వున దూసుకొచ్చాడు. అభిమానులు ముద్దుగా లార్డ్ అని, మ్యాన్ ఆఫ్ గోల్డెన్ ఆర్మ్ అని శార్దూల్ ను పిలుచుకుంటారు. గతంలో కీలకదశలోతన వికెట్లు తీయడం, పరుగులు చేయడంతో ఆపేరు వచ్చింది. ప్రస్తుతం ఐపీఎల్లో అత్యంత విజయవంతమైన బౌలర్ గా నిలిచి, పర్పుల్ క్యాప్ హోల్డ్ చేస్తున్నాడు. అలాంటి ఆటగాడిని గత ఏడాది జరిగిన వేలంలో ఏ జట్టు కొనుగోలు చేయలేదంటే ఆశ్చర్యమే. ఆ తర్వాత రీప్లేస్ మెంట్ గా లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వచ్చి, ఏకంగా కెరీర్ బెస్ట్ ను కూడా నమోదు చేశాడు. తన జర్నీ వింటుంటునే స్పూర్తి దాయంకం. 33 ఏళ్ల శార్దూల్.. ఏడాదిన్నర కిందటి వరకు టీమిండియాలో రెగ్యులర్ ఆటగాడిగానే ఉండేవాడు. అయితే ఆ తర్వాత గాయాలు, ఫామ్ కోల్పోవడంతో జట్టులో నుంచి చోటు కోల్పోయాడు. డిసెంబర్ 2023 తర్వాత తను జాతీయ జట్టు తరపున ఆడలేదు. అయితే దేశవాళీల్లో మాత్రం క్రమం తప్పకుండా పాల్గొంటూ తన స్కిల్స్ ఇంప్రూవ్ చేసుకున్నాడు. కీలకదశలో వికెట్లు తీయడంతోపాటు బ్యాటర్ గా కూడా ధాటిగా ఆడగల సిసలైన ఆల్ రౌండర్ గా తన పట్టును మరింత పెంచుకున్నాడు. ఇక గతేడాది కచ్చితంగా శార్దూల్ ను ఐపీఎల్ జట్లు కొనుగోలు చేస్తాయని భావించినా, ఆఖరిని అతను అన్ సోల్డ్ గా మిగిలాడు. అయితే దేశవాళీ సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ, రంజీట్రోఫీలో సత్తా చాటి అందరి ఫోకస్ లో పడ్డాడు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ చేయనుండటంతో అతని గురించి కొన్ని ఫ్రాంచైజీలు ఆలోచించాయి. ఇక, ఈ దశలో కౌంటీలో ఆడటం కోసం ఎస్సెక్స్ తో ఆల్మోస్ట్ ఒప్పందం కుదుర్చుకునే దశలో శార్దూల్ కు అనుకోని ఆఫర్ వచ్చింది. లక్నో మెంటార్, దిగ్గజ పేసర్ జహీర్ ఖాన్.. ఫోన్ చేసి, లక్నో తరపున ఆడేందుకు సిద్ధంగా ఉండాలని, రీప్లేస్ మెంట్ గా తనను తీసుకుంటామని చెప్పాడు. ఇక ఐపీఎల్ ప్రారంభానికి ముందు నిర్వహించిన ట్రైనింగ్ సెషన్లకు శార్దూల్ హాజరయ్యి, జట్టులో భాగమయ్యాడు. రూ.2 కోట్ల బేస్ ధరకు తనను లక్నో కొనుగోలు చేసింది. ఇక తొలి మ్యాచ్ లో ఢిల్లీపై రెండు వికెట్లు తీసిన శార్దూల్, పటష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న సన్ రైజర్స్ పై విశ్వరూపం ప్రదర్శించాడు. కెరీర్ బెస్ట్ (4-34)తో సత్తా చాటి, ఓవరాల గా ఆరు వికెట్లతో పర్పుల్ క్యాప్ ను సొంతం చేసుకున్నాడు. దీంతో ఒక్కసారిగా తను హాట్ టాపిక్ అయ్యాడు. నిజానికి లక్నో బౌలింగ్ లైనప్ గాయాల కారణంగా బలహీన పడింది. తొలి మ్యాచ్ లో అవేశ్ ఖాన్, మోసిన్ ఖాన్, మయాంక్ యాదవ్, ఆకాశ్ దీప్ సింగ్ లాంటి ప్లేయర్లు పాల్గొనలేదు. ఇందులో మోసిన్ ఖాన్ గాయంతో టోర్నీకి దూరం కాగా, అతని ప్లేస్ లో శార్దూల్ వచ్చాడు. ఇక రెండో మ్యాచ్ లో అవేశ్ కూడా రావడంతో లక్నో బౌలింగ్ బలపడింది. మొత్తానికి ఒకదశలో అన్ సోల్డ్ గా మిగిలి, పట్టుదలతో తిరిగి ఐపీఎల్ ఆడుతున్న శార్దూల్.. లక్నోకు పెద్ద దిక్కుగా మారడంపై పలువురు ప్రశంసిస్తున్నారు.

# టీ20 ప్రపంచకప్‌కు శ్రేయస్‌ను ఎంపిక చేయండి

## ఇంగ్లాండ్ దిగ్గజం, మాజీ కెప్టెన్ మైకేల్ వాన్



**లండన్:** ఈ ఏడాది నుంచి శ్రేయస్ ఎంత ఫామ్ లో ఉన్నడానేది అందరికీ తెలిసిందే. ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్ లో అనుకోకుండా తుదిజట్టులో దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న శ్రేయస్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. ఆ సిరీస్ తో పాటు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని భారత్ నెగ్గడంలో తను కీలకపాత్ర పోషించాడు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన భారత క్రికెటర్ గా నిలిచాడు. అయితే అలాంటి ఆటగాడిని భారత టీ20 జట్టులో ఎందుకు ఆడించడం లేదని ఇంగ్లాండ్ దిగ్గజం, మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ ప్రశ్నించాడు. తను సూపర్ ఫామ్ లో ఉన్నాడని, తన ఆటతీరు టీ20లకు అతికినట్లుగా సరిపోతుందని తాజా ఐపీఎల్ ఇన్నింగ్స్ చూస్తే తెలుస్తోందని వ్యాఖ్యానించాడు. అయితే ఇండియా సెలెక్టర్లు తనని ఎందుకని పొట్టి ఫార్మాట్లో ఆడించడం లేదో తెలియడం లేదని వ్యాఖ్యానించాడు. తాజాగా గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో 97 పరుగుల అజేయ ఇన్నింగ్స్ తో శ్రేయస్ దుమ్ము రేపాడు. తన సెంచరీ కోసం చూసుకోకుండా, చివర్లో బ్యాటింగ్ శశాంక్ సింగ్ కు ఇవ్వడం అందరి మనసులను దోచింది. ఈ ఇన్నింగ్స్ గరించి వాన్ మాట్లాడాడు. మెగాటోర్నీలోని ఫామ్ నే ఐపీఎల్లోనూ కొనసాగించాడని కితాబిచ్చాడు. ముఖ్యంగా స్పిన్నర్లను అలవోకగా ఎదుర్కొంటూ భారీ సిక్సర్లను బాదాడని, మైదానం నలువైపులా తను షాట్లు ఆడాడని పేర్కొన్నాడు. ఇక 2023లో జరిగిన వన్డే ప్రపంచప్ లో సత్తా చాటిన శ్రేయస్.. ఒక్క ఫైనల్లో మాత్రమే విఫలమయ్యాడని గుర్తు చేశాడు. మరోవైపు 2023లో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టును కోల్పోయాక దేశవాళీల్లో తన సత్తా చాటాడు. పరుగుల వరద పారించడంతో తిరిగి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. నిజానికి గత నెలలో ఇంగ్లాండ్ తో జరిగిన తొలి వన్డేలో అతనికి తుది జట్టులో చోటు లేదు. అయితే గాయం కారణంగా చివరి నిమిషంలో మ్యాచ్ నుంచి కోహ్లీ తప్పుకోవడంతో శ్రేయస్ ను జట్టులోకి ఎంపిక చేశారు. అప్పటి నుంచి తను జట్టులో రెగ్యులర్ సభ్యునిగా మారిపోయాడు. వచ్చే టీ20 ప్రపంచకప్ భారత్, శ్రీలంకలో జరుగుతుందని, అలాగే వన్డే ప్రపంచకప్ కూడా సౌతాఫ్రికాలో నిర్వహిస్తారని వాన్ తెలిపాడు. అక్కడ పిచ్ లు ఇప్పుడు నెమ్మదిగా మారాయని, ఈ పిచ్ లలో శ్రేయస్ అద్భుతంగా ఆడగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఇప్పటికైన టీ20 ప్రపంచకప్ ప్రణాఎళికల్లో శ్రేయస్ లాంటి అనుభవం గల ప్లేయర్ ని చేరిస్తే బాగుంటుందని వ్యాఖ్యానించాడు. మూడు ఫార్మాట్లలో కేవలం వన్డేల్లో మాత్రమే శ్రేయస్ రెగ్యులర్ గా ఆడుతున్నాడు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





# రేసు నుంచి సల్మాన్‌ఖాన్ అవుట్

**అట్లీతో అల్లుఅర్జున్ సినిమా**

అట్లీతో ఇప్పట్లో మూవీ చేయడం లేదని స్పష్టం చేశారు. అది భారీ బడ్జెట్ సినిమా అని అందుకే ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నామని చెప్పారు. కానీ భవిష్యత్తులో కచ్చితంగా అట్లీతో సినిమా ఉంటుందని అన్నారు. సల్మాన్ ఖాన్ ప్రకటనతో బన్నీ అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. సల్మాన్ ఖాన్ తో ప్రస్తుతం సినిమా లేనందున అట్లీ అల్లు అర్జున్ కాంబోలో సినిమా సెట్స్ పైకి వెళ్తుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నిజానికి బన్నీ పుష్ప తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా చేయాల్సి ఉంది. అయితే అది భారీ బడ్జెట్ మైథలాజికల్ మూవీ కావడంతో మూవీ పట్టాలెక్కేందుకు ఇంకా టైం పట్టే ఛాన్సుంది. ఈ గ్యాప్‌లో అట్లీతో మూవీ చేయాలని అల్లు అర్జున్ భావిస్తున్నట్లు సమాచారం. అట్లీ, అల్లు అర్జున్ కాంబోలో తెరకెక్కనున్న సినిమాకు ఇప్పటికే కథ ఓకే అయిందని, త్వరలోనే అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఉగాది రోజున దీనికి సంబంధించి క్లారిటీ వచ్చే ఛాన్సుంది. ఒకవేళ వీరిద్దరి కాంబోలో సినిమా వస్తే పాన్ ఇండియా రేంజ్ లో మరో హిట్ పక్కా అని బన్నీ ఫ్యాన్స్ అంటున్నారు.

## వెంకటేశ్‌తో హరీశ్ శంకర్ సినిమా



ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించాడు టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్. దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ చిత్రం పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకర్షించడంలో విజయవంతమైంది. ఈ సినిమా ద్వారా వెంకటేష్ తన కెరీర్‌లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమా విజయంతో ఉత్సాహంగా ఉన్న ఈ స్టార్ హీరో, తన తదుపరి చిత్రాన్ని సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వెంకటేష్ వివిధ దర్శకుల నుంచి కథలు వినడంలో బిజీగా ఉన్నాడని సమాచారం. ఈ సందర్భంలోనే ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ కూడా ఓ కథను వెంకటేష్‌కు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ కథ వెంకీకి నచ్చడమే కాకుండా, నిర్మాత సురేష్ బాబు కూడా దీన్ని ఆమోదించినట్లు వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్‌ను వెంకటేష్ ఖరారు చేసినట్లు చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం వెంకటేష్ కెరీర్‌లో 77వ సినిమాగా రానున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది. సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ సినిమా తర్వాత హరీశ్ శంకర్‌కి అసలు హిట్ లేదన్న విషయం తెలిసిందే. దువ్వాడ జగన్నాథం సినిమా కలెక్షన్స్ సాధించిన కూడా ఫ్లాప్‌గా నిలిచింది. ఇక రీసెంట్‌గా మిస్టర్ బచ్చన్ అంటూ వచ్చి డిజాస్టార్‌ను అందుకున్నాడు. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసి మీదా ఉన్న హరీశ్ శంకర్ ప్రస్తుతం వెంకీమామ కోసం సాలిడ్ కథ రెడీ చేసినట్లు తెలుస్తుంది.



# పూరీ జగన్నాథ్‌ను రిజెక్ట్ చేసిన హీరోయిన్

**ఆ తర్వాత సినిమాల కోసం ఎదురుచూపు**

*టాలీవుడ్ ఇండస్ట్రీలో డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు పూరి జగన్నాథ్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన బద్రి సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. 2006లో మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాతో బాక్సాఫఈస్ వద్ద సంచలనం సృష్టించారు. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను రూపొందించి.. హీరోయిజం అంటే సరికొత్త అర్థం చెప్పారు. పూరి సినిమాలకు యూత్ లో మంచి క్రేజ్ ఉంటుంది. పూరి జగన్నాథ్ సినిమాల కోసం అభిమానులు, యూత్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అలాంటి టాప్ డైరెక్టర్ సినిమాలో అవకాశం వస్తే నటించాలని ఎంతో మంది ఆర్టిస్టుల కల. కానీ ఓ హీరోయిన్ మాత్రం పూరి జగన్నాథ్ సినిమా నుంచి ఆఫర్ రిజెక్ట్ చేసిందట. మోడలింగ్ రోజుల్లో ఇండస్ట్రీ గురించి ఏమి తెలియదని.. అప్పుడే పూరి జగన్నాథ్ సినిమాలో ఛాన్స్ వచ్చిందని కానీ ఆ ప్రాజెక్ట్ చేయడానికి ఒప్పుకోలేదని చెప్పుకొచ్చింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. తనే హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు చిత్రపరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోయిన్ ఆమె. స్టార్ హీరోల సరసన ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. పెళ్లి తర్వాత సైతం కెరీర్ లో రాణిస్తుంది రకుల్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్.. కెరీర్ ఆరంభం, పెళ్లి గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లోనే మోడలింగ్ చేశానని.. ఆ సమయంలో తన ఫోటోస్ చూసి కన్నడ సినిమా నుంచి ఆఫర్ వచ్చిందని.. అప్పట్లో తనకు సౌత్ ఇండస్ట్రీ గురించి అంతగా తెలియదని చెప్పుకొచ్చింది. ఆ సినిమా వాళ్లు తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడటంతో గిల్లి సినిమాలో నటించానని.. సినిమా షూటింగ్ వల్ల చదువులో సమస్యలు వచ్చాయని.. ఫస్ట్ మూవీతోనే నటనకు మంచి గుర్తింపు వచ్చిందని చెప్పుకొచ్చింది. ఆ తర్వాత తనకు పూరి జగన్నాథ్ నుంచి కాల్ వచ్చిందని.. దాదాపు 70 రోజులు డేట్స్ అడిగారని.. అందుకు తాను అంగీకరించలేదని తెలిపింది. కాలేజీ ఉందని.. కావాలంటే నాలుగు రోజులు ఇస్తానని చెప్పిందట. సినిమాల్లో ఎన్ని రోజులు వర్క్ ఉంటుందనేది తనకు అప్పట్లో తెలియదని.. ఆయన తన ఇబ్బందిని అర్థం చేసుకున్నారని తెలిపింది. ఆ సమయంలో ఎన్నో ఆఫర్స్ వదులుకున్నట్లు చెప్పుకొచ్చింది.*



# రూ.700 కోట్ల బడ్జెట్‌తో హృతిక్ సినిమా

బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్నాడు. ఈ విషయాన్ని అతడి తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4తో హృతిక్ మెగాఫోన్ పట్టబోతున్నాడు. ఈ విషయాన్ని తెలుపుతూ.. హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. దుగ్గూ (హృతిక్ రోషన్) 25 సంవత్సరాల క్రితం నిన్ను నటుడిగా పరిచయం చేశాను. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత ఆదిత్య చోప్రా నేను కలిసి దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నాం. దర్శకుడిగా నీ ప్రయాణంలో నువ్వు అనేక విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను. మా ప్రతిష్టాత్మక చిత్రం 'క్రిష్ 4'కి నీవు దర్శకత్వం వహిస్తుండటం సంతోషంగా ఉందంటూ రాకేష్ రోషన్ రాసుకోచ్చాడు. ఈ విషయం తెలిసిన బాలీవుడ్ ప్రముఖులు హృతిక్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్ట్ రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు సమాచారం.



# ఇప్పట్లో ప్రభాస్ పెళ్లి లేనట్టే

సోషల్ మీడియాలోనూ ప్రభాస్ పెళ్లి గురించి రకరకాల పోస్టులు దర్శనమిచ్చాయి. వీటిని చూసిన చాలామంది ప్రభాస్ పెళ్లి వార్తలు నిజమేననుకున్నారు. అయితే వాటిలో ఎలాంటి నిజం లేదని తేలిపోయింది. ప్రభాస్ పెళ్లి వార్తలపై ఆయన టీమ్ స్వయంగా స్పందించింది. ఇలాంటి అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని అభిమానులకు విజ్ఞప్తి చేసింది. దీంతో ప్రభాస్ పెళ్లి వదంతులకు చెక్ పడినట్టైంది.



**కొత్త లుక్స్‌తో హల్‌చల్ చేస్తున్న**

# అనన్యపాండే

బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఈ ముద్దుగుమ్మ 1998 అక్టోబర్ 30న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి చంకీ పాండే కూడా బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు, తల్లి భావనా పాండే ఒక కాస్ట్యూమ్ డిజైనర్. అనన్య 2019లో "స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2" చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీమేల్ డెబ్యూ కూడా లభించింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్నది. అనన్య తన కెరీర్‌లో పతి పత్నీ ఔర్ వో, లైగర్, డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో నటించింది. లైగర్ ఈ బ్యూటీ తొలి తెలుగు చిత్రం. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన ఆమె నటించింది, కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత ఈ భామ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై దృష్టి సారించింది. గెహరాయియా, ఖో గయే హమ్ కహా, కంట్రోల్, కాల్ మీ బే వంటి ప్రాజెక్ట్‌లలో ఆమె నటన ప్రశంసలు అందుకుంది. ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అనన్య భారీ ఫాలోయింగ్ ఉంది.

# క్రేజీ కాంబో

**విజయ దేవరకొండతో కీర్తిసురేష్ సినిమా**



'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకున్న కీర్తి సురేష్ ఈ మధ్య తెలుగులో కనిపించడం లేదు. గతేడాది వివాహం బంధంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గతంలో హోమ్లీగా కనిపించే ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌లోకి వెళ్లగానే తనలోని మరో కోణాన్ని బయటపెట్టింది. బేబీ జాన్‌తో ఆమె గ్లామర్‌కి నార్త్ జనాలు ఫిదా అయిపోయారు. దీంతో సినిమా డిజాస్టర్ అయినా కీర్తి మాత్రం మంచి మార్కులే కొట్టేసింది. పెళ్లి తర్వాత దూకుడి పెంచిన కీర్తి మళ్లీ టాలీవుడ్‌పై ఫోకస్ పెట్టింది. దీంతో ఆమెకు వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. నితిన్, వేణు యెల్దండి కాంబినేషన్లో దిల్ రాజు నిర్మిస్తోన్న 'ఎల్లమ్మ'లో కీర్తి సురేష్ నటిస్తోందంటూ వార్తలొస్తున్నాయి. ఈ క్యారెక్టర్ కోసం ముందుగా సాయిపల్లవిని అడిగితే డేట్స్ అడ్జస్ట్ లేక నో చెప్పేసిందట. దీంతో ఆమె ఆఫర్ కీర్తి వద్దకు చేరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ భామ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పక్కన ఛాన్స్ కొట్టేసింది. విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' అనే సినిమాలో నటిస్తున్నాడు. దీని తర్వాత 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన్' మూవీ చేయనున్నాడు. దీనికి దిల్ రాజు నిర్మాత. ఈ ప్రాజెక్టులో కీర్తి సురేష్‌ని తీసుకుంటే కాంబినేషన్ అదిరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారట. ఇక సుహాస్ పక్కన 'ఉప్పు కప్పురంబు' మూవీ ఇప్పటికే కన్ఫామ్ అయిన సంగతి తెలిసిందే. జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకుని 'మహానటి'గా కీర్తించబడుతోన్న కీర్తి సురేష్ ఇకపై కమర్షియల్ బాటలో నడుస్తూ గ్లామర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవాలని తెగ ఆరాటపడుతోందట.

Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**